# కల్లుముంత

(మన దేశంలో కల్లుముంత నాట్యం చేస్తున్నంత వరకు శాంతి ఉండదు. మద్యపాన నిషేధ చట్టం అమల్లోకి వచ్చాక యేర్పడ్డ ప్రశాంతి, ఆ చట్టాన్ని ఉపసంహరించాక కలిగిన అనర్థాలు చూపడానికి నిదర్శనం మాత్రమే.)

మద్యపాన నిషేధ చట్టం అమల్లోకి వచ్చాక ఆ మాలగూడెమంతా కాస్త సుఖపడ గలిగింది. అందులో బాగా ఉన్నత స్థితికి వచ్చిన వాళ్లల్లో పొట్టేలుగాడు ప్రథముడు. అతడికి పొట్టేలుగాడని యెందుకు పేరొచ్చిందంటే నాయుడుగారే పనికి పంపినా పొట్టేల్లా ముందుకు దుమికి పనిచేసేవాట్ట. అతగాడికి యిద్దరు పెళ్లాలు. తొలి పెళ్లానికి ద్రోణాచలం అని ఒక కొడుకు. మళ్లీ పెళ్లాం యెవడితోనో లేచిపోయిందని పుకారు.

కల్లుపాకల్లేని కాలంలో పొట్టేలుగాడు దండిగా డబ్బులు మిగిలెట్టాడు. రెండు పూరిండ్లు కట్టుకున్నాడు. ఓ జత ఎడ్లు కూడా పట్టుకున్నాడు. కొడుక్కి గౌరవంగా పెళ్ళి చేశాడు. పెళ్ళి వూరేగింపునాడు బ్యాండు, గుఱ్ఱాల్ని కూడా తెప్పించాడు. అందరూ ఆ పెళ్ళిని గొప్ప చెప్పుకున్నారు. ఎవరేమనుకున్నా ద్రోణాచలం పెళ్ళి మాత్రం ఆడంబరంగానే జరిగిందని వొప్పుకొని తీరాలి.

నాయుడుగారంటే ఆ వూళ్లో అందరికీ చాలా గౌరవం. ఆయన కోసం ప్రాణాల్నైనా వొదిలెట్టడానికి సిద్ధంగా వుంటారు. ఆయనంటే అంత విశ్వాసం.

ఆగస్టు అల్లరులు చెలరేగినై. కల్లు దుకాణాలు ఏలం వేయబడినై. నాయుడు గారు కూడా నాలుగు దుకాణాలకు యజమానుదారుడై కూచున్నాడు. కల్లు ముంతలు దేశమంతటా నాట్యం చేస్తున్నై. పొట్టేలుగాడు మళ్ళీ తాగడం మొదలు పెట్టాడు. అప్పుడప్పుడు నాయుడు పొట్టేలుగాడికి కల్లు చీటి యిస్తూండేవాడు. వాడు తప్పతాగి తందనాలాడేవాడు.

ఓ నాటి రాత్రి కోడలు నిద్దరోతుంటే పొట్టేలుగాడు ఆమె గజ్జెలడ్డిగె దొంగిలించాడు. తనకప్పుడప్పుడూ డబ్బు ఇస్తుండే రామి దగ్గరకు తీసుకెళ్లాడు. రామమ్మ శూద్ర వితంతువు. వయస్సు నలభై సంవత్సరాలుంటై. ఈ మధ్య పొట్టేలుగాడితో సంబంధం పెట్టుకుందని అమ్మలక్కలు చెప్పుకునే వాళ్లు. ఓమారు నాయుడుగారి కొడుకు, పొట్టేలుగాడు-రామమ్మ యిద్దరూ చేరి కల్లు త్రాగుతూ వుంటే చూడటం జరిగింది. అందరి నోళ్లల్లో పడడంతో రామమ్మ గారి సోదరుడు నాయుడు గారికి మూడు వందలిచ్చాక కులంలో చేర్చుకున్నట్లు ప్రకటించబడింది. రామమ్మ, ఆ నగ తీసి పదిలంగా దాచిపెట్టి పొట్టేలుగాడికి ఐదు రూపాయలిచ్చింది. ఆ రూపాయల్లో మూడు తీసుకెళ్ళి అమీనాకిచ్చాడు. అమీనా కల్లును అంగడికి పంపకముందే రెండు గాలన్లు ప్రత్యేకించి పొట్టేలు గాడికి ముంత అణన్నర కివ్వడం అలవాటు. దుకాణంలో మామూలుగా ముంత ధర రెండణాలే.

రామి ప్రోద్బలంతో మిగిలిన రెండు రూపాయిలకు సారా కాచటానికి కావలసిన పట్ట, పండ్లు వగైరాలు కొనుక్కున్నాడు. కల్లు రాకముందే పొట్టేలు గాడికి సారా కాచడం బాగా తెలుసు. అప్పుడు కాంగ్రెసు గవర్నమెంటు మెట్టుచ్చు కొని బొచ్చువూడ గొడుతుందని భయపడే వాడు. ఇప్పుడు నెలకో మారేనా ఓ భట్టీ దించుతుంటాడు.

పొట్టేలుగాడితో ఐతేపల్లి చేరుకున్నాడు. వాడి స్వగ్రామం ఐతేపల్లి కావడంచే వాడిని ఐతేపల్లి అని పిలుస్తారు. ఆ వూరుముందు గుట్టలో భట్టీదించి కొంచం త్రాగారు, కొంచం అమ్ముకున్నారు.

ద్రోణాచలం విషయం తెలుసుకున్నాడు. పొట్టేలుగాడిని అడిగిచూచాడు. నా సొత్తు నేనెత్తుకున్నానని యెదురు తిరిగాడు. ఆ మాట వినిందే ద్రోణాచలం పొట్టేలు గాణ్ణి మెడబట్టి గెంటేశాడు. వాడు కొడుకుతో ఢీకొన్నాడు. ఇద్దరూ బాగా దెబ్బలాడారు. ఐతేపల్లి వచ్చి కొట్లాట ఆపుచేశాడు. ఈ వ్యవహారం నాయుడు గారివద్ద కెళ్ళింది. నాయుడిద్దర్ని పిలిపించి చెరో పది జుల్మానా వేశాడు. నాయుడు గారు ద్రోణాచలాన్ని మాత్రం దగ్గరకు పిలిచి "నీవు చెల్లించనవసరం లేదు. నాకు సాయంగావుంటే చాల"న్నాడు.

పొట్టేలుగాడు రామమ్మను బ్రతిమలాడి పది రూపాయలు తెచ్చాడు. నాయుడు గారింటికెడుతుంటే ఐతేపల్లి అడ్డగించుకున్నాడు. "మనం యీ పది

రూపాయలు పెట్టి సారా కాచితే నలభై రూపాయలు సంపాదించవచ్చు, అపరాధం రేపు కట్టేద్దాం" అని వుద్బోధించాడు. నయంగా పేటకు తీసుకెళ్లాడు. కావలసిన సామగ్రి అంతా కొనుక్కున్నారు.

ఈ విషయం నాయుడుగారికి నాగరత్నం చెప్పేశాడు. అతడికి, రామమ్మకు స్నేహం వుంది గాబట్టి పొట్టేలు గాడంటే ఆడికి చుర్రుమంటుంది.

నాయుడుగారు కల్లు దొరకు రిపోర్టు రాయించాడు. పొట్టేలుగాడు, ఐతేపల్లి సారాకాచి అమ్మడం వల్లా తన దుకాణాలకు తీరని నష్టం వస్తుందని తెలియచేశాడు. కల్లు దొరకు, నాయుడు గారికి చాలా స్నేహం. టౌన్‌లో రేషన్ వచ్చాక దొరగారికి సన్నబియ్యం తానే సరఫరా చేసే వాడు. ఓ మారు దొరుక్కుని రేషన్ వాళ్ళకు (చౌకీపోస్టుల వద్ద వుండేవాళ్లకు) రెండు గాలన్లు కల్లు లంచమిచ్చి తప్పుకున్నాడు.

కల్లు దొరవచ్చేశాడు. ఆ రాత్రి ఆయనగారికి బ్రాంది, మాంసం వగైరాలు బాగా పెట్టారు. సరిగ్గా రాత్రి మూడు గంటలకే బయల్దేరారు. ఈ మధ్య సబ్ ఇన్‌స్పెక్టరుకు లంచమిచ్చి నాయుడుగారు ఓ డబుల్ బారుగన్ సంపాయించాడు. కల్లుదొర వద్దన్నాగూడా తీసుకున్నాడు. నలుగురు జవాన్లు నాయుడు గారి బావమరిదితో గూడా వున్నారు.

అపాటికే ఐతేపల్లి సారా త్రాగి చేపలు తింటున్నాడు. పొట్టేలుగాడు మాత్రం తిని దొర్లుతున్నాడు. కల్లుదొర పొట్టేలుగాణ్ణి చూచిందే ఓ తన్నిచ్చాడు. పొట్టేలుగాడికి మైకంలో ఒళ్లు తెలిని కోపం వచ్చింది. దగ్గరుండే సీసాతో సరిగ్గా నొసటికి అంటుకున్నాడు. దొరగారికి ఆ పాటికే బ్రాందీ తాగిన మైకం కొద్దిగా వుండడం వల్లా అట్టే వాలిపోయాడు.

నాయుడు పొట్టేలుగాణ్ణి పట్టుకున్నాడు, ఐతేపల్లి మాత్రం తప్పించుకుని పారిపోయాడు.

పొట్టేలుగాణ్ణి యింటికి తీసుకొచ్చి బాగా చితక్కొట్టారు. ద్రోణాచలానికి మనస్సు కరిగింది. కన్నతండ్రి గదూ? నాయడు గారి కాళ్ళు పట్టుకున్నాడు. కల్లు దొరగార్ని ప్రార్థించాడు. లాభం లేకపోయింది.

పొట్టేలుగాడిపై కల్లు దొర కేసు పెట్టాడు. నాయుడు గారు ద్రోణాచలం వద్ద యెద్దుల్ని అమ్మించి (తానే కొనుక్కున్నాడు) నాలుగువందలు పుచ్చుకున్నాడు కేసు ఖర్చులకని. వ్యవహారం నాలుగు మాసాలు జరిగింది. నాయుడు గారు

పొట్టేలు గాడిని విడిపిస్తారనే వదంతి పొక్కిపోయింది. మళ్ళీగూడ వంద రూపాయలు నాయుడు గారికి అప్పయ్యాడు పాపం – ద్రోణాచలం.

కల్లుదొర గారికి గాయం పెద్దది గావడం వల్లా నాయుడు గారు సాక్ష్యం పలకడం వల్లా పొట్టేలు గాడికి నాలుగేళ్ళు జైలయిపోయింది. ద్రోణాచలం వంద రూపాయలు అప్పయినందుకు నాయుడుగారి వద్ద పాలేరుగా కుదురు కున్నాడు. ఇక ద్రోణాచలం ప్రతిదినమూ నాయుడు గారి పనులే చేస్తూండాలి. నాయుడుగారి పాలనలోనే వుండాలి. తనకు వొక అరగడియ తీరిక వుండదు. వాళ్ళు దయతలిచివేస్తే తిండితినాలి. లేకుంటే వుపవాసం వుండాలి. తన జీవితమంతా నాయుడుగారి పిడికిటిలోనే వుంటుంది. తండ్రి చేసిన పనికి తానీనాడు ఫలితం అనుభవిస్తున్నాడు.

ఐతేపల్లి హాయిగా మిలటరీలో చేరిపోయాడు. నెలనెలా పది రూపాయలు యింటికి పంపుతుంటాడు. నాయుడు గారు పట్టణానికెళ్లి హాయిగా యింకో బ్రాందిషాపుగూడా పెట్టుకున్నాడు. ద్రోణాచలం తల్లిని మెల్లిగా నెట్టేశాడు. తాను వొంటరివాడినని అప్పుల వాడినైపోయానని చెప్పి తప్పించుకున్నాడు.

పాపం పొట్టేలుగాడి పెళ్ళాం ఆలోచించింది. కూలి చేయడానికి శక్తి లేదు. శూద్ర స్త్రీ అయివుంటే యే కామందు యింట్లోనైనా పనికత్తెగా ప్రవేశించి వుండేది. మాలదాన్ని యెవరు చేరుస్తారు? ఆమె జీవితం నడియెడారిలో నిలిచి పోయింది. జానెడు పొట్టకోసం యెవర్ని యాచించడం. తన కళ్ళముందు కల్లుముంత గిర్రుమని తిరిగింది. భర్త గమనానికి వచ్చాడు. బందిఖానాలో యేం చేస్తున్నాడో! కొడుకు మంచి మాటల్తోనే గెంటేశాడు. ఆమెకు దొరతనమంటే యేమో తెలీదు. కల్లు దుకాణాలు మూసినపుడు ఆ దొరతనానికి దణ్ణాలు పెట్టింది. కల్లు దుకాణాలు తెరిచాక ఆమె హృదయంలోనే దొరతనాన్ని నిందించింది. ఒక్కొక్కప్పుడు యేడ్చుకుంది. ఈ కల్లు దుకాణాలు పోతే వంద రూపాయలకు గుడికట్టిస్తానని దేముని యెదుట చెప్పింది.

ఆమెకిప్పుడు యే ఆధారమూ లేకపోయింది. అలా బిచ్చమెత్తుకుంటూ పల్లెలెంబడి పయనమైంది.

పొట్టేలుగాడు చెరసాలలోనే వున్నాడు. అతడెప్పుడూ యేదో ఆలోచించు కుంటుంటాడు. అప్పుడప్పుడు కల్లుముంత తన కళ్లకు ప్రత్యక్షమవుతుంది.

ఐతేపల్లి మిలటరీలో వున్నా అతని హస్తాల్లో కల్లుముంత యెప్పుడూ

కనబడుతూనే వుంటుంది. ద్రోణాచలం యిప్పుడిప్పుడూ కల్లును రుచి చూస్తున్నాడు. అతడికి నాయుడు గారు వారానికోమారు చీటీ యిస్తుంటాడు. నాయుడుగారికి కల్లుముంత అక్షయపాత్ర అయిపోయింది.